Place your advertisements on website

https://rajadhanivartalu.com
call us at whatsapp

94406 62699

# రాజధాని వార్తలు

# RAJADHANIVARTALU

ఏపి రాజధాని అమరావతి రైతులు ఇప్పటికీ ప్రభుత్వం నుండి తమ వార్షిక కౌలు చెల్లింపుల కోసం ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వం వారి వార్షిక కౌలు వీలైనంత త్వరగా చెల్లిస్తుందని ఆశిస్తున్నాను. ప్రభుత్వం మరింత ఆలస్యం చేస్తే అవి సరైన పద్ధతి కాదే కాదు- పి.హుస్సేన్ ఖాన్, ఎం.ఎస్.సి. ఎడిటర్, రాజధాని వార్తలు

rajadhanivartalu@gmail.com
94406 62699

అమరావతి సంపుటి (Vol) : 6 సంచిక (Issue) : 347 పేజీలు (Pages) : 4 ఆంధ్రప్రదేశ్ 'రాజధాని' తొలి తెలుగు దినపత్రిక (Andhra Pradesh Capital's First Telugu Daily)

ఆదివారం, 1 - 6 - 2025

94406 62699 rajadhanivartalu rajadhaniv www.rajadhanivartalu.com RNI No.: APTEL/2019/77985 స్థాపితం : 2015

## జాతీయ వీరత్వానికి చిహ్నంగా సింధూరం.. ప్రధాని మోదీ కీలక వ్యాఖ్యలు



**భోపాల్:** సింధూరం సంప్రదాయకంగా వివాహ బంధానికి చిహ్నమైనప్పటికీ, ఇప్పుడు అది నారీ శక్తి జాతీయ వీరత్వానికి చిహ్నంగా మారిందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. ఆపరేషన్ సిందూర్‌ను ఉదహరిస్తూ ఇది భారతీయ మహిళల ధైర్యం, శక్తి, సంకల్పాన్ని ప్రతిబింబిస్తోందని ఆయన చెప్పారు. మధ్యప్రదేశ్ భోపాల్‌లో శనివారం నిర్వహించిన మహిళా శక్తీకరణ మహా సమ్మేళనంలో ప్రధానమంత్రి పాల్గొన్నారు. దేవి అహల్యాబాయి హొల్కర్ 300వ జన్మదినోత్సవం సందర్భంగా ఈ కార్యక్రమం నిర్వహించారు.

**పేదలకు సాయం..**

దేవుని ఆరాధన, ప్రజల సేవకు దేవి అహల్యాబాయి ఎలాంటి భేదం చూపలేదని ప్రధాని మోదీ అన్నారు. ఆమె పేదల జీవితాల్లో పురోగతి కోసం అవిశ్రాంతంగా కృషి చేశారని చెప్పారు. కాశీలో సేవ చేసే అవకాశం నాకు లభించడం సంతోషకరమన్నారు. అక్కడే అహల్యాబాయి అభివృద్ధి పనులకు మొదట పునాది వేశారని మోదీ గుర్తు చేసుకున్నారు. ఆమె మహిళలను చేనేత రంగంలో శక్తివంతం చేశారని, నీటి సంరక్షణతో రైతులు ఎక్కువ ఆదాయం పొందేలా సహాయపడ్డారని వెల్లడించారు. స్త్రీలకు కూడా ఆస్తి హక్కులు ఉండాలని, భర్తలు అకాల మరణం చెందినా తిరిగి వివాహం చేసుకోవచ్చని అహల్యా ఆ కాలంలో చెప్పారని మోదీ అన్నారు.

**అనేక కుటుంబాలకు**

అహల్యాబాయి గిరిజన సమూహాల కోసం కూడా కృషి చేశారని, వారికి వ్యవసాయ భూములు కేటాయించి అభివృద్ధికి తోడ్పడ్డారని ప్రధాని అన్నారు. జూనాగఢ్ నుంచి కుటుంబాలను మహేశ్వర్‌కు తీసుకొచ్చి, మహేశ్వరీ చీరల తయారీలో నైపుణ్యం నేర్పించారన్నారు. ఇది ఇప్పటికీ అనేక కుటుంబాలకు ఆదాయ వనరుగా ఉందని మోదీ తెలిపారు. అహల్యాబాయి అభివృద్ధి, పురోగతికి చిహ్నమని.. ప్రజలు ఇచ్చిందే మనకు సొంతమని ఆమె చెప్పారని మోదీ ప్రస్తావించారు.

**మహిళల కోసం..**

ప్రస్తుత ప్రభుత్వం నీటి సరఫరా, గ్యాస్ కనెక్షన్, విద్యుత్ సరఫరా, వైద్య సంక్షేమ పథకాల ద్వారా సమాజ పురోగతి కోసం కృషి చేస్తోందన్నారు మోదీ. గతంలో మహిళలు తమ అనారోగ్యాలను దాచుకునేవారు. తమ కుటుంబంపై భారం కాకూడదని భావించేవారు. కానీ, ఇప్పుడు ఆయుష్మాన్ భారత్ యోజన ద్వారా ఐదు లక్షల రూపాయల వరకూ వైద్య సహాయం పొందుతున్నారని మోదీ చెప్పారు. మూడు కోట్ల మహిళలను లఖ్‌పతి దీదీలుగా చేస్తామని మేము వాగ్దానం చేశాం. ఇప్పుడు వేలాది మంది మహిళలు స్వయం సహాయక బృందాలతో అనుసంధానమై ఉన్నారు. భారతదేశం గొప్ప సంస్కృతి కలిగిన దేశం. మన సంప్రదాయంలో సింధూరం నారీ శక్తికి చిహ్నం. శ్రీరాముడిని ఆరాధించడానికి హనుమంతుడు కూడా సింధూరం ఉపయోగించాడని ప్రధాని మోదీ ప్రస్తావించారు.

## కలెక్టరేట్‌లో కరోనా.. ఐసోలేషన్‌కు ఉద్యోగులు

**ఏలూరు, (రాజధాని వార్తలు):** ఏలూరు కలెక్టరేట్‌లో కరోనా కలకలం రేపింది. కలెక్టరేట్‌లో పనిచేస్తున్న ఐదుగురు ఉద్యోగులకు కోవిడ్ పాజిటివ్‌గా వైద్యులు నిర్ధారించారు. దీంతో వారిని హోం ఐసోలేషన్‌కు తరలించారు. నిన్న కలెక్టరేట్ సిబ్బందికి కరోనా పరీక్షలు నిర్వహించగా.. ఐదుగురికి కోవిడ్ పాజిటివ్ అని తేలింది. మిగిలిన సిబ్బందికి నెగెటివ్‌గా వచ్చింది. కలెక్టరేట్‌లో ఉద్యోగులకు కరోనా పాజిటివ్ రావడంతో తోటి ఉద్యోగులు ఆందోళన వ్యక్తం చేశారు. కాగా.. ఇటీవల కాలంలో కరోనా తీవ్రంగా ప్రబలుతోంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వ అధికారులు, సిబ్బంది అప్రమత్తమయ్యారు. ప్రభుత్వ అధికారులు ఎక్కడికక్కడ కరోనా పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా నిన్న ఏలూరు కలెక్టరేట్ సిబ్బందికి ఆర్టీపీసీఆర్ పరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్షల్లో మొత్తం ఐదుగురు సిబ్బందికి కరోనా పాజిటివ్ అని తేలింది. ఈరోజు ఉదయం రిజల్ట్ రాగా... కరోనా పాజిటివ్ అని వచ్చిన ఐదుగురు ఉద్యోగులను హోం ఐసోలేషన్‌కు తరలించారు. మొత్తం కలెక్టరేట్‌లోని రెండు సెక్షన్ల సిబ్బందికి కరోనా పరీక్షలు నిర్వహించినట్లు అధికారులు తెలిపారు. అయితే పశ్చిమగోదావరి జిల్లా, ఏలూరు జిల్లాలో కరోనా చాప కింద నీరులా పారుతోంది. గత కొన్ని రోజులుగా పదికి పైగానే కరోనా పాజిటివ్ కేసులు నమోదు అయ్యాయి. ముఖ్యంగా ఏలూరులోనే దాదాపు ఐదు కేసులు నమోదు అయ్యాయి. ఇప్పుడు తాజాగా ఏలూరు కలెక్టరేట్‌లో మరో ఐదు కేసులు బయటపడటంతో జిల్లాలో కరోనా




తీవ్రత ఎక్కువగా ఉన్నట్లు తెలుస్తోంది. గతంలో తణుకుకు సంబంధించి ఓ ఉద్యోగికి కరోనా సోకింది. చికిత్స అనంతరం తిరిగి కరోనా పరీక్షలు నిర్వహించగా నెగిటివ్ అని తేలింది. ఏలూరు కలెక్టరేట్‌లో కరోనా నిర్ధారణ అవడంతో అప్రత్తమైన అధికారులు ఎక్కడికక్కడ శానిటైజేషన్ చర్యలు చేపట్టారు. ఇక ఏపీలో తొలి కరోనా కేసు విశాఖపట్నంలో నమోదు అయ్యింది. విశాఖకు చెందిన ఓ మహిళకు కరోనా పాజిటివ్ అని నిర్ధారణ అవడంతో వెంటనే చికిత్స అందేశారు. ఆమె కుటుంబం ఉంటోన్న పరిసరాల్లో శానిటైజేషన్ చేశారు. అలాగే కడప రిమ్స్‌లో 70 ఏళ్ల మహిళకు కరోనా పాజిటివ్ అని తేల్చారు వైద్యులు. జలుబు, జ్వరంతో బాధపడుతున్న మహిళకు కరోనా పరీక్షలు నిర్వహించగా కరోనాగా నిర్ధారణ అయ్యింది.

## ఏపీ మెగా డీఎస్సీ.. హాల్ టికెట్లు రిలీజ్ చేసిన మంత్రి లోకేష్




**మంగళగిరి, (రాజధాని వార్తలు):** ఆంధ్రప్రదేశ్ విద్యా శాఖ ఏపీ మెగా డీఎస్సీ 2025 హాల్ టిక్కెట్లను నేడు మంత్రి నారా లోకేష్ విడుదల చేశారు. అభ్యర్థులుకు అధికారిక పోర్టల్ https://apdsc. apcfss.in లేదా వాట్సాప్ ద్వారా కూడా హాల్ టికెట్లు డౌన్ లోడ్ చేసుకోవచ్చు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు వారి రిజిస్ట్రేషన్ నంబర్, పుట్టిన తేదీతో లాగిన్ అయి వారి హాల్ టిక్కెట్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి. ఏపీ డీఎస్సీ హాల్ టికెట్ విడుదల సందర్భంగా మంత్రి లోకేష్ అభ్యర్థులకు శుభాకాంక్షలు తెలిపారు. 'మెగా డీఎస్సీ నిర్వహణ పట్ల మా నిబద్ధత నెరవేరింది. డీఎస్సీలో అభ్యర్థులు ఉత్తమ ప్రతిభ కనబరచాలి' అని ఆకాంక్షించారు. ఏపీ మెగా డీఎస్సీ హాల్ టికెట్లు రిలీజ్ అయ్యాయి. అధికారిక వెబ్‌సైట్ cse.ap.gov.inలో అందుబాటులోకి వచ్చాయి. అయితే, ఈసారి అధికారులు వాట్సప్ ద్వారా కూడా అభ్యర్థులు హాల్ టికెట్లు డౌన్ లోడ్ చేసుకునే వెసులుబాటు కల్పించారు. 95523 00009కు మెసేజ్ చేస్తే చాలు. హాల్ టికెట్లు పొందవచ్చని విద్యాశాఖ అధికారులు పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా వివిధ పాఠశాలల్లోని 16,347 టీచర్ పోస్టుల ప్రభుత్వం ఈ నియామకం ద్వారా భర్తీ చేయనుంది. స్కూల్ అసిస్టెంట్, సెకండరీ గ్రేడ్ టీచర్, శిక్షణ పొందిన గ్రాడ్యుయేట్ టీచర్, పోస్ట్ గ్రాడ్యుయేట్ టీచర్, ప్రిన్సిపాల్స్ పోస్టులు భర్తీ చేసేందుకు జూన్ 6 నుంచి 30 వరకు సీబీటీ విధానంలో పరీక్ష నిర్వహించనున్నారు. మొత్తం 3,35,401 మంది ఈ పరీక్షకు దరఖాస్తు చేశారు.

## పెన్షన్‌పై సీఎం చంద్రబాబు కీలక ప్రకటన




**కోనసీమ, (రాజధాని వార్తలు):** జిల్లాలోని చెయ్యేరులో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పర్యటన కొనసాగుతోంది. కాట్రేనికోన మండలం చెయ్యేరులో లబ్దిదారులకు సీఎం పెన్షన్లను పంపిణీ చేశారు. అనంతరం ప్రజావేదిక సభలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. ఒక రోజు ముందుగానే రాష్ట్రంలో పెన్షన్లు పంపిణీ చేశామని.. ఉపాధి కూలీలకు పని ప్రదేశాల్లోనే పెన్షన్లు ఇస్తున్నామని అన్నారు. ఇదీ.. పేదల కోసం ప్రభుత్వం పనిచేసే తీరు అని చెప్పుకొచ్చారు. హామీ ఇచ్చిన ప్రకారం అధికారంలోకి రాగానే పెన్షన్లను రూ.3 వేల నుంచి రూ.4 వేలకు పెంచామని అన్నారు. 64 లక్షల మందికి ప్రతినెల 1వ తేదీనే పెన్షన్లు అందిస్తున్నామన్నారు. రాష్ట్రంలో ఇప్పటికే 90 శాతం పెన్షన్ల పంపిణీ పూర్తి అయినట్లు వెల్లడించారు. ఏడాదిలోనే కూటమి ప్రభుత్వం పేదలకు కనీవినీ ఎరుగని రీతిలో సహాయం చేసిందన్నారు. రూ.34 వేల కోట్లు పింఛన్ల కోసం ఇచ్చామని తెలిపారు. దేశంలో ఎక్కడా తమ ప్రభుత్వం ఇచ్చినట్లు పెన్షన్లు ఇవ్వడం లేదని అన్నారు. మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారులు పేదల కోసం ఆలోచించాలన్నారు. భగవంతుడు కనికరిస్తే భవిష్యత్తులో పింఛన్లు పెంచుతామని ప్రకటించారు. గత వైసీపీ ప్రభుత్వం వితంతు పింఛన్లు ఇవ్వలేదని.. తాము వచ్చాక 71,380 మందికి పెన్షన్ ఇచ్చామన్నారు. ధనిక రాష్ట్రం మహారాష్ట్రలో పెన్షన్ రూ. 1000, తెలంగాణలో రూ.2500 మాత్రమే పింఛన్లు ఇస్తున్నారన్నారు. అధిక పెన్షన్ ఇచ్చే ఏకైక రాష్ట్రం ఏపీ అని తెలిపారు. 3 నెలల పెన్షన్ ఒకేసారి తీసుకునే అవకాశం ఇచ్చామన్నారు. మెగా డీఎస్సీతో ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేస్తున్నామని అన్నారు. రాష్ట్రంలో 5 లక్షల మంది వర్క్ ఫ్రమ్ హోమ్ కింద ఉద్యోగం చేస్తున్నారని తెలిపారు. ఉచిత సిలెండర్ల కోసం నాలుగు నెలలకోసారి అకౌంట్‌లో డబ్బులు జమ అవుతున్నాయన్నారు. రూ.1200 కోట్లతో రాష్ట్రంలో రోడ్లు రిపేర్ చేశామన్నారు. 203 అన్నా క్యాంటీన్లో భోజనం అందిస్తున్నామన్నారు. రూ.1674 కోట్లు పాత ధాన్యం బకాయిలు చెల్లించామని తెలిపారు. నియోజకవర్గంలో 10 వేల సోలార్ కనెక్షన్లు ఏర్పాటు చేయకపోతే ఎమ్మెల్యే పవర్ కట్ చేస్తామని హెచ్చరించారు. గంజాయి, డ్రగ్స్ చాలా ప్రమాదకరమన్నారు. వైసీపీ ప్రభుత్వంలో విచ్చల విడిగా లభ్యమయ్యాయని మండిపడ్డారు. శాటిలైట్ డ్రోన్స్ ద్వారా గంజాయి నిర్మూలన చేస్తున్నామన్నారు. స్కూళ్లు తెరిచేలోగా ఎంత మంది పిల్లలు ఉంటే అంతమందికి తల్లికి వందనం ఇస్తామని మరోసారి స్పష్టం చేశారు. దేశంలో దక్షిణాది రాష్ట్రాల్లో జనాభా తగ్గిపోయిందని.. రాష్ట్రంలో జనాభా పెరగాలన్నారు. జూన్ నుంచి అన్నదాత సుఖీభవ అమలు చేయనున్నట్లు తెలిపారు. ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు పథకాన్ని అమలులోకి తీసుకురానున్నట్లు చెప్పారు. కడప మహానాడులో తన జీవితంలో చూడని స్పందన చూశానని అన్నారు. ఎప్పటికీ ఈ ప్రభుత్వాన్ని నిలబెట్టుకునే బాధ్యత ప్రజలదే అని చెప్పారు. మరో రెండు నెలల్లో అన్ని ప్రభుత్వ సేవలు వాట్సాప్ గవర్నెన్స్‌లో అందుబాటులోకి వస్తాయన్నారు. కోనసీమలో 1996 తుఫాన్ బీభత్స రోజులను గుర్తు చేసుకున్న సీఎం.. నాడు తాను స్వయంగా చేపట్టిన సహాయక చర్యల గురించి వివరించారు. అందరికీ సామాజిక న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. ఎవరికీ అన్యాయం జరగకుండా వర్గీకరణ చేస్తామని.. భవిష్యత్తులో జిల్లాల స్థాయిలోనూ రిజర్వేషన్లు ఉంటాయన్నారు. రాజకీయాలు చేస్తూ తప్పుడు ఆరోపణలు చేస్తే ఊరుకోనని హెచ్చరించారు. బాబాయి హత్యలోనూ రాజకీయం చేశారని... ఇప్పుడు కూడా అలాగే చేయాలని అనుకుంటున్నారని మండిపడ్డారు. టీటీడీలో అరాచకాలు చేస్తూ ప్రభుత్వం ఫెయిల్ అయిందని చెప్పాలని చూశారని.. టెక్నాలజీ వాడి తప్పులు బయటకు తీస్తామని వార్నింగ్ ఇచ్చారు. రాయలసీమలో ఎన్నికలు వస్తే బాంబులు అడిగేవారని.. ఇప్పుడు ముఠాలు లేవన్నారు. కోనసీమలో అంబేద్కర్ విగ్రహాలను దెబ్బ తీస్తూ.. విగ్రహాల రాజకీయం చేస్తున్నారని ఫైర్ అయ్యారు. కోనసీమ అనంతపురం కంటే వెనుకబడిపోయిందని అన్నారు. త్వరలో సంక్షేమ క్యాలెండర్ విడుదల చేస్తామన్నారు. రేషన్ వాహనాల పేరుతో అరాచకం చేశారని మండిపడ్డ సీఎం.. జూన్ 1నుంచి రేషన్ షాపుల్లో బియ్యం సరఫరా చేయనున్నట్లు తెలిపారు. పేరుకు మాత్రమే డోర్ డెలివరీ అని.. ఆ బియ్యాన్ని అక్కడే తీసుకుని కాకినాడ పోర్టుకి ఎగుమతి చేశారని ఆరోపించారు. గత ప్రభుత్వంలో మాఫియా చేశారని ఆగ్రహం వ్యక్తంచేశారు. రాష్ట్రానికి నేర చరితులు వచ్చారని.. దానికి రాజకీయ ముసుగు తొడిగారని వ్యాఖ్యలు చేశారు. ఆర్థిక ఉగ్రవాదులు సమాజాన్ని అతలాకుతలం చేయాలని అనుకుంటున్నారని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.

## ఏపీలో అంతరాష్ట్ర క్రికెట్ బెట్టింగ్ ముఠా అరెస్ట్



**కర్నూలు, (రాజధాని వార్తలు):** జిల్లాలోని ఆదోనీలో క్రికెట్ బెట్టింగ్ ముఠా యథేచ్ఛగా బెట్టింగ్‌లకు పాల్పడుతున్నారు. ఇంటర్నెట్, మొబైల్ యాప్‌లు అందుబాటులోకి రావడంతో క్రికెట్ బెట్టింగ్ ముఠాలు తమ కార్యకలాపాలను కొనసాగిస్తున్నారు. ప్రధానంగా యువతకు క్రికెట్‌పై ఉన్న ఇష్టాన్ని ఆసరాగా చేసుకుని కేటుగాళ్లు ముగ్గులోకి దింపుతున్నారు. పలు బెట్టింగ్ యాప్‌ల ద్వారా యువతను ఇందులోకి లాగుతున్నారు. అధిక లాభాలు వస్తాయని ఆశ చూపించి యువతను బెట్టింగ్ పెట్టేలా చేస్తున్నారు. డబ్బులు వస్తాయనే ఆశతో వందలు, లక్షల్లో యువత అప్పుచేసి మరీ బెట్టింగ్ పెడుతున్నారు. బెట్టింగ్‌లో యువత ఆర్థికంగా నష్టపోయేలా చేస్తున్నారు. బెట్టింగ్‌లో డబ్బులు కోల్పోవడంతో యువత ఆత్మహత్యకు పాల్పడుతున్నారు. బెట్టింగ్ ముఠాపై పోలీసులకు ఫిర్యాదులు అందండతో దీనిపై దృష్టి సారించారు. ఇవాళ (శనివారం) పలువురిని ఆదోనీ పోలీసులు అరెస్ట్ చేసి విచారణ జరుపుతున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆదోనీలో బెట్టింగ్‌కు పాల్పడుతున్నట్లు సమాచారం అందడంతో తనిఖీలు చేశారు. ఈ సోదాల్లో బెట్టింగ్‌కు పాల్పడుతున్న అంతరాష్ట్ర క్రికెట్ బెట్టింగ్ ముఠాను అరెస్ట్ చేశారు. ఏడుగురు నిందితులను అరెస్టు చేసి కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ సమక్షంలో మీడియా ముందు పోలీసులు ప్రవేశపెట్టారు. వీరిని అదుపులోకి తీసుకున్న పోలీసులు విచారణ జరుపుతున్నారు. ఈ విచారణలో పలు కీలక విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. ఈ ముఠా సభ్యుల నుంచి రూ.91 లక్షల నగదు, 7 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా మీడియాతో కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ మాట్లాడారు. బెట్టింగ్ వల్ల నిర్వాహకులకు మాత్రమే లాభం ఉంటుందని సామాన్యులు మోసపోతున్నారని చెప్పారు. క్రికెట్ బెట్టింగ్ యాప్‌లపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. క్రికెట్ బుకీలు డబ్బు ఆశ చూపి యువతను క్రికెట్ బెట్టింగ్‌కు ప్రోత్సహించినా..బెట్టింగ్‌కి పాల్పడినా కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ హెచ్చరించారు.

## అమరావతిలో క్వాంటం వ్యాలీ టెక్ పార్క్‌కు మార్గం సుగమం

**అమరావతి, (రాజధాని వార్తలు):** రాజధాని అమరావతిలో క్వాంటం వ్యాలీ టెక్నాలజీ పార్కు ఏర్పాటుకు చేసుకున్న ఎంఓయూను ర్యాటిఫై చేస్తూ ఈరోజు (శనివారం) ఐటీశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. అమరావతిలో క్వాంటం వ్యాలీ టెక్నాలజీ పార్కును అగ్రశ్రేణి ఐటీ సంస్థలు టీసీఎస్, ఎల్ అండ్ టీ, ఐబీఎం నిర్మాణం చేపట్టనున్నాయి. క్వాంటం వ్యాలీ టెక్నాలజీ పార్క్ నిర్మాణానికి ఈ మూడు సంస్థలతో రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందం చేసుకున్న విషయం తెలిసిందే. క్వాంటం కంప్యూటింగ్ పార్కులో అధునాతన 156 క్యూబిట్ క్వాంటం సిస్టం 2 ను ఐబీఎం సంస్థ ఏర్పాటు చేయనుంది. క్వాంటం కంప్యూటింగ్ సర్వీసెస్, సొల్యూషన్స్‌తో పాటు పరిశోధన, హైబ్రీడ్ కంప్యూటింగ్ స్ట్రాటజీస్‌ను టీసీఎస్ అందించనుంది. అలాగే వైద్యారోగ్యం, ఆర్థిక, ఉత్పత్తి, విద్యా రంగాలకు చెందిన వివిధ అప్లికేషన్లు, పరిశోధన సహకారాన్ని అందించేలా టీసీఎస్‌తో ఒప్పందం కుదుర్చుకుంది ప్రభుత్వం. క్లైంట్ నెట్వర్క్‌తో పాటు స్టార్టప్, ఇతర ప్రాజెక్టుల నిర్వహణ, ఇంజనీరింగ్ నైపుణ్యాలను ఎల్ అండ్ టీ సంస్థ అందించనుంది. 2026 జనవరి 1 నాటికి అమరావతి రాజధానిలో అధునాతన క్వాంటం వ్యాలీ టెక్నాలజీ పార్క్ సిద్ధం కానుంది.

# సిరిపురం పంచాయతీలో 88.39 ఎకరాల్లో అక్రమ ఆక్వా సాగు : సిపిఎం



**కరప, (రాజధాని వార్తలు):** కాకినాడ రూరల్ నియోజకవర్గంలోని కరప మండల పరిధిలోని సిరిపురం గ్రామ పంచాయతీలో సుమారు 88.39 ఎకరాల్లో అనధికారికంగా ఆక్వా సాగు జరుగుతోందని జిల్లా మత్స్య శాఖ గుర్తించింది. ఈ మేరకు మత్స్య శాఖ అధికారి 692/డి/2025 తేది 16-05-2025న విడుదల చేసిన మెమోలో, విద్యుత్ శాఖ అధికారికి లేఖ రాస్తూ, అక్రమ చెరువులకు ఇచ్చిన విద్యుత్ కనెక్షన్లను వెంటనే తొలగించాల్సిందిగా సూచించారు. సిపిఎం జిల్లా నాయకులు ఎం.రాజశేఖర్ వెల్లడించిన వివరాల ప్రకారం ఒక ఆక్వా సాగు దారుడు 28 మంది రైతుల నుండి భూములను లీజుకు తీసుకుని, ప్రభుత్వ నిబంధనలను అతిక్రమిస్తూ చెరువులను ఏర్పాటు చేశాడు. గ్రామస్థుల వ్యతిరేకతతో పాటు, రైతుల ఆందోళనలకు దారితీసిన ఈ అంశంపై సిపిఎం నాయకత్వంలో గతంలో తీవ్ర పోరాటం జరిగినట్లు తెలిపారు. ఆ సమయంలో పోలీసు కేసులు నమోదవ్వడంతో కోర్టులకు కూడా హాజరయ్యే పరిస్థితి ఏర్పడిందని, అయినా పార్టీ వెనకడుగు వేయలేదన్నారు. అధికారుల జోక్యంతో ఇప్పటికే కొన్ని చెరువులను తొలగించినప్పటికీ, మిగిలినవి ఇప్పటికీ కొనసాగు తున్నాయని, వాటిని కూడా వెంటనే తొలగించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. మండల రెవెన్యూ అధికారులు స్పందించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని రాజశేఖర్ కోరారు.

# కరప మండలంలో 56 ఉచిత విద్యా సీట్లు కేటాయింపు

## - ఆర్టీఈ చట్టం కింద లాటరీ ద్వారా ఎంపిక



**కరప, (రాజధాని వార్తలు):** హక్కు విద్యా చట్టం ఆర్టీఈ - 2009 ప్రకారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ప్రైవేట్ అనుబంధిత (అన్ ఎయిడెడ్) పాఠశాలల్లో మొదటి తరగతిలో 25 శాతం సీట్లను ఉచితంగా కేటాయించే కార్యక్ర మాన్ని కొనసాగిస్తోంది. ఈ చర్యలో భాగంగా 2025-26 విద్యా సంవత్సరానికి కరప మండలానికి చెందిన 15 ప్రైవేట్ పాఠశాలల్లో మొత్తం 56 ఉచిత సీట్లు అర్హులైన విద్యార్థులకు లాటరీ విధానంలో కేటాయించడం జరిగిందని మండల విద్యాధికారి (ఎంఈఓ)-2 పి. సత్యనారాయణ వెల్లదించారు. అభ్యర్థుల ఎంపిక పూర్తిగా ప్రామాణికంగా, పారదర్శకంగా జరిగి నట్లు ఆయన తెలిపారు. ఎంపికైన విద్యార్థులు ప్రైవేట్ పాఠశాలల్లో చేరిన తర్వాత ప్రభుత్వం కల్పించే అన్ని విద్యా సదుపాయాలు పొందగలరని ఆయన వివరించారు. ఈ కార్యక్రమం ద్వారా సామాజిక, ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు చెందిన చిన్నారులకు నాణ్యమైన విద్య అందే అవకాశం కలుగుతోందని ఎంఈఓ పేర్కొన్నారు.

# ఇళ్ల స్థలాలపై పోరాటం ఆపేది లేదు...!

## - జూలై 15, 16 తేదీల్లో సామర్లకోటలో కాకినాడ ద్వితీయ జిల్లా మహాసభలు : సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తాటిపాక మధు



**సామర్లకోట, (రాజధాని వార్తలు):** భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ కాకినాడ ద్వితీయ జిల్లా మహాసభలు జూలై 15, 16 తేదీలలో సామర్ల కోటలో నిర్వహిస్తున్నట్లు సిపిఐ జిల్లా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తాటిపాక మధు వెల్లడించారు. శుక్రవారం సామర్లకోట విశ్వబ్రాహ్మణ కమ్యూనిటీ హాల్లో జిల్లా మహాసభలు విజయవంతానికి గానూ జిల్లా విస్తృత సమావేశం పి సత్యనారాయణ అధ్యక్షతన నిర్వహించారు. తొలుత ఇటీవల మరణించిన మృతవీరులకు రెండు నిమిషాల పాటు సంతాపం తెలిపి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా ఈ సమావేశాన్ని ఉద్దేశించి తాటిపాక మధు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా మహాసభల కాలం ప్రారంభమైందని, ఇప్పటికే ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో శాఖ మహాసభలు జరుగుతున్నాయన్నారు. జూన్ మాసంలో కాకినాడ జిల్లాలో పట్టణ, మండల మహాసభలు పూర్తి చేసుకుని జూలై 15, 16కు జిల్లా మహాసభలకు పార్టీ శ్రేణులు సమాయత్తం కావాలని ఆయన పిలుపునిచ్చారు. కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చిన విధంగా అర్బన్లో రెండు సెంట్లు, రూరల్లో మూడు సెంట్లు అర్హులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని, ఇప్పటికే సిపిఐ ఆరు నెలలుగా పలు దశల్లో ఉద్యమాలు నిర్వహించిందన్నారు. ఆయా పేదవారి దరఖాస్తులు తహసిల్దార్లకు, జిల్లా కలెక్టర్కు అందజేశామన్నారు. అయినా పేదవారికి ఇల్లు ఇవ్వడంలో చంద్రబాబు ప్రభుత్వం ఎందుకు తాత్సారం చేస్తున్నారని ఆయన ప్రశ్నించారు. సూపర్ సిక్స్ హామీలు కూడా ఇప్పటికీ అమలు చేయలేదని ఆయన విమర్శించారు. కాకినాడ జిల్లాలో ఇసుక, మట్టి అవినీతి వ్యాపారం జోరుగా సాగుతుందని, దీనిపై పలు ఫిర్యాదులు చేసిన స్పందించే నేతలు కరువయ్యారని ఆయన విమర్శించారు. అధికారంలోకి రాగానే మున్సిపల్ భవన నిర్మాణ కార్మికులకు న్యాయం చేస్తామని చెప్పిన నాయకులు ఇప్పటికీ వారి హామీలు నెరవేర్చలేదని మధు అన్నారు. సిపిఐ జిల్లా కార్యదర్శి కే బోడకొండ మాట్లాడుతూ కాకినాడ జిల్లాలో అనేక ప్రజా సమస్యలు నెలకొని ఉన్నాయని, ముఖ్యంగా యు కొత్తపల్లి మండలం కొమరగిరి లేఔట్లో సిపిఐ దరఖాస్తు చేసిన పేదలందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా జిల్లా మహా సభల పోస్టర్లను నాయకులు ఆవిష్కరించారు. ఇంకా ఈ సమావేశంలో సిపిఐ పిఠాపురం నియోజక వర్గ కార్యదర్శి కేశవరపు అప్పలరాజు, మహిళా సమాఖ్య జిల్లా కన్వీనర్ ఏ భవాని, పెద్దాపురం పట్టణ కార్యదర్శి రామకృష్ణ, కార్మిక నాయకులు కిషోర్, ప్రజానాట్యమండలి జిల్లా కన్వీనర్ మండల రమణ, అర్జున్ రావు, శివాజీ, పి రాజేశ్వరరావు, ఎస్ శంకర్, రమణ తదితరులు పాల్గొని మాట్లాడారు.

# రూరల్ టీడీపీలో సత్తా ఉన్న నాయకుడు కటకంశెట్టి : కాకరపల్లి చలపతి

**కాకినాడ రూరల్, (రాజధాని వార్తలు):** కాకినాడ రూరల్ నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీని సమర్ధవంతంగా నడిపించగల సత్తా ఉన్న నాయకుడు కటకంశెట్టి వెంకట ప్రభాకర్(బాబి) అని తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు కాకరపల్లి చలపతి పేర్కొన్నారు. శుక్రవారం కటకంశెట్టి బాబి కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కాకరపల్లి చలపతిరావు మాట్లాడుతూ ప్రస్తుతం రాష్ట్రంలో జరుగుతున్న రాజకీయ పరిణామాలలో యువ నాయకులు అవసరం ఎంతో ఉందని, అదే ఉద్దేశ్యంతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు కూడా యువ నాయకులను ప్రోత్సహించడం జరుగు తుందని తెలిపారు. ఇటీవల కాకినాడ రూరల్ నియోజకవర్గంలో జరిగిన నియోజకవర్గ స్థాయి మిని మహానాడు కార్యక్రమాన్ని నిర్వహించేందుకు ఎవరూ ముందుకు రాని సమయంలో తెలుగుదేశం పార్టీ కాకినాడ రూరల్ నియోజకవర్గ కో-కోఆర్డినేటర్గా కటకంశెట్టి బాబి మినీ మహానాడును విజయవంతంగా నిర్వహించి బాబి తన సత్తా చాటుకున్నారన్నారు. అదేవిధంగా కడపలో జరిగిన మహానాడు సభకు కాకినాడ రూరల్ నియోజక వర్గం నుండి పెద్దఎత్తున నాయకులు, కార్యకర్తలను తీసుకు వెళ్ళడంతో పాటు వారికి కావాల్సిన సదుపాయాలను ఏర్పాటు చేయడం, సభ అనంతరం తిరిగి సురక్షితంగా




ఇంటికి చేర వేయడం జరిగిందని తెలిపారు. నియోజకవర్గాన్ని సొంత కుటుంబంగా భావించి ముందుండి నడిపించే కటకంశెట్టి బాబి వంటి నాయకుడిని రాష్ట్ర కమిటీ గుర్తించి ఆయనకు మరిన్ని ఉన్నత పధవులు అందించడంతో పాటు నియోజకవర్గ బాధ్యతలు అప్పగిస్తే క్యాడర్ రెట్టించిన ఉత్సాహంతో పనిచేయడానికి అవకాశం ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గౌడ్ కార్పొరేషన్ డైరెక్టర్ మట్ట ప్రకాష్, కరప మాజీ ఎంపీపీ గుల్లిపల్లి శ్రీనివాస్, కౌజు నెహ్రు, ఏటుకూరి నాగమణి, లోవరాజు, పొదరపు ఉమా, తెలుగుదేశం నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఏలేరు కాలువ, చెరువుల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు




**పెద్దాపురం, (రాజధాని వార్తలు):** పెద్దాపురం మండలంలోని ఏలేరు కాలువల వద్ద, చెరువుల వద్ద ప్రమాద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసారు. తహసీల్దారు సీహెచ్ వెంకటలక్ష్మి ఆదేశాలతో సిబ్బంది ఏలేరు కాలువ, ప్రమాదకరమైన చెరువుల వద్ద ఈ బోర్డులను ఏర్పాటు చేశారు. ఏలేరు కాలువలో, ప్రమాధకరమైన చెరువుల్లో దిగి స్నానాలు చెయ్యడం, ఈదటం అత్యంత ప్రాణాపాయకరమని హెచ్చరిక బోర్డుల్లో పేర్కొన్నారు. ఈత వచ్చిన వారు కూడా దిగటం గానీ, ఈదుటకు గానీ అనుమతి లేదని వాటిద్వారా సూచించారు. అలాగే ప్రజలందరికీ తెలియ జేయడం కోసం గ్రామాల్లో దండోరా వేయించినట్లు తహసీల్దార్ తెలిపారు. నిబందనలు మీరిన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోనున్నట్టు హెచ్చరించారు.

# కార్మిక రాజ్యస్థాపనకు ఏకం కావాలి...!



**సామర్లకోట, (రాజధాని వార్తలు):** కార్మిక రాజ్యాన్ని స్థాపించేందుకు కార్మికులందరూ ఏకం కావాలని సిఐటియు మండల అధ్యక్షులు బాలం శ్రీనివాస్ పిలుపునిచ్చారు. సిఐటియు 55వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను శుక్రవారం స్థానిక మెహర కాంప్లెక్స్ సిఐటియు కార్యాలయం వద్ద ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు మండల అధ్యక్షులు బాలం శ్రీనివాస్ మాట్లాడుతూ కష్టజీవుల ఐక్యత పోరాటం నినాదంతో సిఐటియు ఏర్పడిందన్నారు. అనేక మంది కార్మికుల హక్కుల కోసం పోరాడి వారికి హక్కులను సాధించిన ఘనత సిఐటియు కే చెందుతుందన్నారు. దేశంలోనే 70 లక్షల సభ్యత్వంతో అతిపెద్ద కార్మిక సంఘంగా సిఐటియు ఉందన్నారు. సంఘం ఏర్పడిన నుండి ఇప్పటి వరకు పోరాటాలతో ముందుకు సాగుతుందన్నారు. తొలుత సిపిఎం పార్టీ పతాకాన్ని ఎగురవేసి నినాదా లిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు కరణం ప్రసాద్ రావు, తుంపాల శ్రీనివాస్, కరణం గోవిందరాజు, బాలం హరిబాబు, కరణం ఏడు కొండలు, పి వీరబాబు, సయ్యపు రెడ్డి తదితరులు పాల్గొని మాట్లాడారు.

# శ్వాసపై ధ్యాసతో ఆరోగ్యం...!





**సామర్లకోట, రాజధాని వార్తలు):** మన ఆరోగ్యం మన చేతుల్లోనే ఉంటుందని, శ్వాసపై ద్యాస ఉంచడమే యోగా ముఖ్య ఉదేశ్యమని, కాబట్టి యోగా ప్రతి ఒక్కరి జీవన విధానంలో భాగం కావాలని జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత స్థానిక బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు తోటకూర సాయి రామకృష్ణ పేర్కొన్నారు. గురువారం ఉదయం నుంచి అయోధ్యరామపురం సచివాలయ పరిధిలోని ప్రజలకు స్థానిక బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్లో ప్రతి రోజూ యోగా శిక్షణ ఏర్పాటు చేసినట్లు సచివాలయ అడ్మిన్ అడపా సత్తిబాబు తెలిపారు.

బ్రహ్మ కుమారి సంస్థకు చెందిన రాజీ అక్కయ్య ఆధ్వ ర్యంలో యోగా శిక్షణ ఇచ్చారు. ప్రతి వ్యక్తి శ్వాసపై ద్యాస ఉం చడం ద్వారా నియంత్రణ సాధ్యపడి ఒత్తిడి లేని ప్రశాంత జీవనం సాగించడానికి యోగా గొప్ప వరమని రాజీ అక్కయ్య తెలిపారు. అలాగే స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో యోగా టివోటి శిక్షణ కార్యక్రమం శుక్రవారం ఘనంగా ముగించారు. ఎంపిడివో కె హిమ మహేశ్వరి ఆధ్వర్యంలో నిర్వహించిన శిక్షణలో డిప్యూటీ ఎంపీడీఓ ఎం.భైరవమూర్తి, ఏవో సతీష్, సీనియర్ అసిస్టెంట్ జగన్నాధ రావు ట్రైనర్స్ బంగార్రాజు, శ్రీనివాస్, రవి, ఆయుష్ మాస్టర్ ట్రైనర్స్ జగదాంబ, లక్ష్మణ్ కుమార్, ఆధ్వర్యంలో వేట్లపాలెం వీకే రాయపురం, కార్యదర్శితోను సచివాలయం సిబ్బందితో శిక్షణ చేపట్టారు. అలాగే స్థానిక మున్సిపల్ కార్యాల యంలో మున్సిపల్ కమిషనర్ ఎ శ్రీవిద్య, భీమేశ్వరాలయంలో ఈవో బళ్ళ నీలకంఠం ఆధ్వర్యంలో యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా యోగా శిక్షణా కార్యక్రమాలు ఘనంగా కొనసాగాయి. ఈ కార్యక్రమాల్లో వార్డ్ సెక్రటరీ ఎస్ పవన్, శానిటరీ ఇన్స్పెక్టర్ కే.సింగరాజు, ఆర్పిలు కే అనంతలక్ష్మి, స్థానిక వ్యాయామ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# సిరిపురం గ్రామంలో పరిశుభ్రతకు ప్రత్యేక చర్యలు

## - ఇంటింటి చెత్త సేకరణపై అవగాహన సదస్సు





**కరప, (రాజధాని వార్తలు):** కరప మండలంలోని సిరిపురం గ్రామంలో పరిశుభ్రతను మెరుగుపరచే దిశగా అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఈ నేపథ్యంలో శుక్రవారం గ్రామంలో ఇంటింటి చెత్త సేకరణపై అవగాహన సదస్సు డిప్యూటీ ఎంపీడీవో సలాది వెంకట శ్రీనివాసరావు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామస్తులు ప్లాస్టిక్ వ్యర్థాలను రోడ్లపై లేదా డ్రైనేజీల్లో వేయకుండా ప్రత్యేకంగా భద్ర పరచాలని సూచించారు. తడి, పొడి చెత్తను వేరు చేసి పారిశుద్ధ్య కార్మికులకు అందించాలన్నారు. చెత్తను శాస్త్రీయంగా వేరు చేయడం ద్వారా పునర్వినియోగ అవకాశాలు పెరగడంతోపాటు, పర్యావరణ పరిరక్షణకు తోడ్పడతామని తెలిపారు. చెత్త నుండి సంపద కేంద్రాలను సందర్శించిన గ్రామస్తులకు అక్కడ తయారయ్యే కంపోస్ట్ ఎరువుల ప్రయోజనాలను పరిచయం చేశారు. వీటిని నర్సరీలు, వ్యవసాయం వంటి అవసరాలకు వినియోగించవచ్చని వివరించారు. ఈ ప్రక్రియ ద్వారా పంచాయితీకి ఆదాయం కూడా లభిస్తుందని పేర్కొన్నారు. గ్రామాల పరిశుభ్రతకు ప్రతి ఒక్కరి భాగస్వామ్యం అవసరమని, శుభ్రమైన గ్రామాల ద్వారా ఆరోగ్యకరమైన వాతావరణం ఏర్పడుతుందని అధికారులు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది, గ్రామస్తులు, పారిశుద్ధ్య కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

# ఘట్టమనేని థర్డ్ జెనరేషన్ ఎంట్రీకి రంగం సిద్ధం



టాలీవుడ్ గర్వించదగ్గ హీరోల్లో సూపర్ స్టార్ కృష్ణ కూడా ఒకరు. మే 31న ఆయన జయంతి సందర్భంగా ఘట్టమనేని ఫ్యాన్స్‌కు పలు రకాలుగా స్పెషల్ ట్రీట్స్ అందుతున్నాయి. కృష్ణ జయంతి సందర్భంగా మహేష్ బాబు నటించిన ఖలేజా సినిమాను రీరిలీజ్ చేయగా, అదే సందర్భంగా ఘట్టమనేని ఫ్యామిలీ నుంచి మరో యంగ్ హీరో ఈ రోజున తన కొత్త అధ్యాయాన్ని మొదలుపెట్టాడు. అతను మరెవరో కాదు. సూపర్ స్టార్ కృష్ణ పెద్ద కొడుకు, మహేష్ అన్న అయిన రమేష్ బాబు కొడుకు జయకృష్ణ. అంటే కృష్ణ గారికి స్వయానా మనవడు. త్వరలోనే ఘట్టమనేని జయకృష్ణ టాలీవుడ్‌లోకి హీరోగా ఎంట్రీ ఇవ్వబోతున్నాడు. ఇప్పటికే జయకృష్ణ యాక్టింగ్‌తో పాటూ పలు విషయాల్లో స్పెషల్ ట్రైనింగ్ తీసుకున్నాడని సమాచారం. ప్రముఖ నిర్మాణ సంస్థ నుంచి విజనరీ డైరెక్టర్ జయకృష్ణ డెబ్యూ బాధ్యతల్ని తీసుకున్నట్టు తెలుస్తోంది. ఇప్పటికే జయకృష్ణ ఫోటో షూట్ కూడా పూర్తి కాగా కృష్ణ జయంతి సందర్భంగా కొన్ని ఫోటోలను కూడా మీడియాకు రిలీజ్ చేశారు. ఈ ఫోటోల్లో జయకృష్ణ ఎంతో ఛార్మింగ్‌గా, హ్యాండ్‌సమ్‌గా కనిపించి అందరి దృష్టిని ఆకర్షించేలా కనిపించాడు. త్వరలోనే జయకృష్ణ మొదటి సినిమా మొదలు కానుండగా, ఈ సినిమాకు ఎవరు దర్శకత్వం వహించనున్నారు? ఎవరు నిర్మించనున్నారనే విషయాలు కూడా వెల్లడి కానున్నాయి. ప్రస్తుతం ఘట్టమనేని జయకృష్ణ ఫోటోలను కృష్ణ, మహేష్ బాబు ఫ్యాన్స్ లైకులు కొడుతూ వైరల్ చేస్తూ ఘట్టమనేని వారసుడి ఎంట్రీకి ఆల్ ది బెస్ట్ చెప్తున్నారు. కృష్ణ తర్వాత ఆయన కొడుకులుగా రమేష్ బాబు, మహేష్ బాబులు సెకండ్ జెనరేషన్ హీరోలుగా రాగా, ఇప్పుడు అదే ఫ్యామిలీ నుంచి మూడో తరం కూడా ఇండస్ట్రీకి పరిచయం కాబోతుంది.


# శ్రుతి హాసన్ 2025లోనూ చప్పగానే!



శ్రుతిహాసన్ వెండి తెరపై కనిపించి ఏడాదిన్నర పూర్తయింది. సలార్ సీజ్ ఫైర్ - తర్వాత ఒక్క చిత్రం కూడా రిలీజ్ అవ్వలేదు. సలార్ కథలో శ్రుతి హాసన్ పాత్ర కీలకమైందే? అయినా అమ్మడు కొన్ని సన్నివేశాలకే పరిమితమైంది. ఆరంభం..ముగింపులో మాత్రమే హైలైట్ అయింది. మిగతా కథ అంతా ప్రభాస్- పృధ్వీరాజ్ సుకుమారన్...ఇతర పాత్రల చుట్టూనే తిరుగుతుంది. దీంతో శ్రుతి హాసన్ పాత్రకు ప్రాధాన్యత ఎక్కడ? అన్న అంశం అమ్మడికి ప్రతికూలంగా మారింది. గత ఏడాది ఒక్క సినిమా కూడా రిలీజ్‌లో లేకుండా పోయింది. ఈ ఏడాది కూడా అమ్మడి కెరీర్ చప్పగానే సాగేలా ఉంది. సూపర్ స్టార్ రజనీకాంత్ నటిస్తోన్న కూలీ చిత్రంలో శ్రుతి హాసన్ నటిస్తుంది. కానీ అందులో శ్రుతి పాత్ర ఏ మేర ఉంటుంది? అన్నది సందేహమే. అలాగే మిస్కిన్ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న ట్రైన్‌లోనూ నటిస్తుంది. విజయ్ సేతుపతి మెయిన్ లీడ్ పోషిస్తున్న చిత్రమిది. శ్రుతి హాసన్ హీరోయిన్ కాదు. ఓ పాత్రధారి మాత్రమే. ఈ సినిమా కూడా ఇదే ఏడాది రిలీజ్ అవుతుంది. ఈ రెండు సినిమాల్లో కూడా శ్రుతి హాసన్ పేరుకే తప్ప ఆమె పాత్ర బలంగా ఉంటుందా? అన్నది సందేహమే. అదే జరిగితే శ్రుతి కెరీర్ లో ఈ రెండేళ్లు పెద్దగా సాధించింది ఏం లేనట్లే. విజయ్ హీరోగా నటిస్తోన్న జననాయగన్‌లో నటిస్తుంది. ఇందులో హీరోయిన్ పాత్ర పూజాహెగ్డే పోషిస్తుండగా ఓ కీలక రోల్ శ్రుతి హాసన్ పోషిస్తుంది.

ఈ సినిమా వచ్చే ఏడాది రిలీజ్ అవుతుంది. సలార్ 2 చేతిలో ఉన్నా? అదెప్పుడు మొదలు పెడతారు? ఎప్పుడు పూర్తవుతుంది? అన్నది తెలియదు. ఇంకా కొత్త కమిట్ మెంట్లు ఏవైనా ఉన్నాయా? అంటే కనుచూపు మేరలో ఎక్కడా కనిపించలేదు. ఇతర భాషల్లో కూడా శ్రుతి హాసన్ ఎలాంటి సినిమాలకు అగ్రిమెంట్ చేసుకోలేదు. దీంతో శ్రుతి కెరీర్ పరంగా వీక్‌గానే కనిపిస్తుంది.


# పహల్గాంకి 'విశ్వరూపం-3' కోసమేనా కమల్ జీ?



పహల్గాం ఘటన ప్రపంచం వ్యాప్తంగా ఎంత సంచలనమైందో తెలిసిందే. ఉగ్రదాడిలో భాగంగా భారతీయులు అసువులు బాసారు. అత్యంత కర్కశంగా మతం అడిగి మరీ దాడికి పాల్పడ్డారు. ప్రతిగా భారత్ 'ఆపరేషన్ సిందూర్' పేరిట ఇద్దరు భారతీయ మహిళలతోనే పాకిస్తాన్ ఉగ్ర చర్యలకు ధీటైన బధులిచ్చింది. భారత్ కన్నెర్రజేస్తే ఎలా ఉంటుందన్నది దాయాదికి మరోసారి అర్దమైంది. దీంతో శాంతి చర్చలకు దిగి రావాల్సి వచ్చిన ఎపిసోడ్ అంతా తెలిసిందే. ఈ ఘటన తర్వాత విశ్వనటుడు కమల్ హాసన్ పహల్గాం పర్యటిస్తానని వెల్లడించారు. టూరిజం పెంచడంలో భాగంగా పహల్గాం వెళ్తానన్నారు. తన లాంటి వాళ్లు అక్కడి వెళ్తే సాధారణ ప్రజలకు మళ్లీ పహల్గా వెళ్లడానికి అవకాశం ఉంటుంది అన్న కోణంలో కమల్ ఈ వ్యాఖ్యలు చేసారు. అయితే తాజాగా కమల్ పర్యటన వెనుక మరో విషయం కూడా తెరపైకి వస్తుంది. కమల్ 'విశ్వరూపం 3'కి కూడా సన్నాహాలు చేస్తున్నట్లు కొన్ని రోజులుగా ప్రచారం జరుగుతుంది.

పహల్గాం ఘటనకు ముందే ఈ విషయంలో వెలుగులోకి వచ్చింది. 'విశ్వరూపం 2'కి కొనసా గింపుగా మూడవ భాగం ఉంటుందని కోలీవుడ్ మీడియాలో వార్తలొచ్చాయి. రెండు భాగాలు కూడా ఉగ్రవాదం నేపథ్యంలో విశ్వరూపం ఫ్రాంచైజీని తెరపైకి తెచ్చిన సంగతి తెలిసిదే. ఈ నేపథ్యంలో కమల్ పహల్గాం పర్యటనకు 'విశ్వరూపం 3'కి ఏమైనా సంబంధాలున్నాయా? అన్నఅంశం తెరపైకి వస్తుంది. పహల్గాం దాడికి పాల్పడింది ఐఎస్ ఐ అనుబంధ ఉగ్ర సంస్థగా ప్రకటించుకుంది. 'విశ్వరూపం'లో ఉగ్రవాదం ఎలా పురుడు పూసుకుంటుంది. దాని మూలాలు ఎలా ఉంటాయి? అన్నది కమల్ గొప్పగా చూపించారు. ఆ రెండు చిత్రాల్లో కమల్ రా ఏజెంట్, స్పై పాత్ర పోషించిన సంగతి తెలిసిందే.

# నానికి క్షమాపణలు చెప్పిన ఎస్‌జె సూర్య!



తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రీసెంట్‌గా అనౌన్స్ చేసిన గద్దర్ సినీ అవార్డుల్లో సరిపోదా శనివారం సినిమాలో బెస్ట్ సపోర్టింగ్ రోల్ చేసినందుకు గానూ ఎస్‌జె సూర్యకు అవార్డు గెలుచుకున్నారు. ఈ సందర్భంగా నాని ఎస్‌జె సూర్యను అభినందిస్తూ ట్వీట్ చేయగా, దానికి ఎస్‌జె సూర్య కూడా రిప్లై ఇచ్చారు. అయితే నాని ట్వీట్‌కు సరైన రిప్లై ఇవ్వకపోవడంపై అసంతృప్తి చెందిన ఎస్‌జె సూర్య శనివారం రోజు నానికి క్షమాపణలు చెప్తూ మరో ట్వీట్ వేశారు. డియర్ నేచురల్ స్టార్ నాని సర్. షూటింగ్ మధ్యలో నేను ట్వీట్ చేసినందుకు క్షమించండి, నేను మీకు సరిగా రిప్లై ఇవ్వలేకపోయాను. మీ ట్వీట్‌కు థ్యాంక్స్ సర్ అని మాత్రమే చెప్పడం కచ్చితంగా సరిపోదు. మీరు, డైరెక్టర్ వివేక్ సర్ సినిమా షూటింగ్ నుంచి ఇప్పుడు ఈ ట్వీట్ వరకు ఇచ్చిన సపోర్ట్ ఎంతో కీలకమైందని, మీ సపోర్ట్ లేకపోతే ఆ అవుట్‌పుట్ సాధ్యమయ్యేది కాదు, మీరు స్క్రీన్‌పై మాత్రమే కాదు, బయట కూడా హీరోనే. థ్యాంక్యూ. మీ మాటలకు చాలా థ్యాంక్స్ సర్ అని ఎస్‌జె సూర్య తన ట్వీట్‌లో రాసుకొచ్చాడు. దానికంటే ముందే నాని సరిపోదా శనివారం సినిమాలో విలన్‌గా నటించిన ఎస్‌జె సూర్యను అభినందిస్తూ ఓ ట్వీట్ చేశాడు. కంగ్రాట్యులేషన్స్ సర్. మీరు సరిపోదా సినిమాలో విలన్, సపోర్టింగ్ యాక్టర్ మాత్రమే కాదు. సరిపోదా శనివారం అంటే మొత్తం మీరే. ఈ అవార్డుకు మీరు అన్ని విధాలా అర్హులు అని నాని పోస్ట్ చేయగా దానికి ఎస్‌జె సూర్య హడావిడిగా రెస్పాండ్ అయి, చాలా థ్యాంక్స్ నేచురల్ స్టార్ నాని సర్ అని ట్వీట్ చేశాడు.

నాని, ఎస్‌జె సూర్య ప్రధాన పాత్రల్లో నటించిన సరిపోదా శనివారం ఆగస్ట్ 29, 2024న రిలీజై భారీ బ్లాక్ బస్టర్‌గా నిలవడమే కాక, గతేడాది భారీ కలెక్షన్స్ సాధించిన సినిమాల్లో కూడా ఒకటిగా నిలిచింది. వివేక్ ఆత్రేయ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమాలో దయా అనే అవినీతిపరుడైన పోలీసాఫీసర్ పాత్రలో ఎస్‌జె సూర్య అద్భుత ప్రదర్శనను కనబరిచి అందరినీ ఆకట్టుకున్నాడు.

# ఎన్టీఆర్ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో పొగాకు రహిత ప్రపంచ దినోత్సవం



**(రాజధాని వార్తలు):** ప్రతి సంవత్సరము మే 31వ తేదీన ప్రపంచ పొగాకు రహిత దినోత్సవం సందర్భంగా వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ మార్కెట్ యార్డులో ఈరోజు ఉదయం నిర్వహించారని ఉపాధ్యక్షులు డిడి నాయుడు తెలిపారు. ఈ కార్యక్రమం 1987లో మొదలైంది మన భారతదేశంలో 26 కోట్లు జనాభా ఈ ధూమ పానం వల్ల ఆరోగ్యం పాడవుతుందని, ఈ ధూమపానం పొగాకు తాగిన వాళ్ళు మూడు రకాలు ఒకటి స్మోక్లెస్ బయటికి స్మోక్ రాదు ముఖ్యంగా కైని గుట్కా పాన్ మసాలా తీసుకున్న వాళ్ళు ఈ రకంగా వస్తారని, రెండు స్మోకింగ్ అంటే పొగ వచ్చే పొగాకు తాగిన వాళ్ళు రెండవ రకం. సిగరెట్టు, బీడీ చుట్ట ఇది ఈ స్మోకింగ్ లోకి వస్తుందని, రేపు అది రెండు కలిపి అంటే కొంతమంది ఖైన్ని తీసుకుంటూ సిగరెట్టు తీసుకుంటారని, ఈ రెండు చేసిన వారిని మూడో రకం క్రింద వస్తారని, పొగాకులో హానికరమైన రసాయనాలు ముఖ్యంగా నికోటిన్ హైడ్రోజన్ సైనేడ్, టార్, ఆర్సెనిక్కా, కార్బన్ మోనాక్సైడ్ ఆ విధంగా నాలుగు వేల రసాయ నాలు ఉన్నాయని నాయుడు అన్నారు. ఈ పొగాకు తాగడం వలన వ్యక్తిగతంగా, ఆరోగ్యకరంగా, ఆర్థికంగా నష్టపోతారని, పొగాకు తాగిన వాళ్ళకి ఊపిరితిత్తుల క్యాన్సర్ నోటి క్యాన్సర్ అలాగే జీర్ణాశయంలో కూడా క్యాన్సరు ప్యాంక్రియాటిక్ క్యాన్సరు గర్భసంచి క్యాన్సరు, గుండె జబ్బులు ఎక్కువగా వస్తాయని, అనకాపల్లి జిల్లా ఆస్పత్రిలో ధూమపాన డి ఎడిక్షన్ సెంటర్ ఉన్నదని, దీనిని పొగ తాగే వాళ్ళందరూ ఉపయోగించుకోవాలని, పొగ తాగవద్దు ఆరోగ్యమే ముద్దు ఆచరించాలని నాయుడు అన్నారు. అనకాపల్లి వాకర్స్ సెక్రెటరీ యల్లపు శివ ఎన్టీఆర్ బెల్లం మార్కెట్ ప్రెసిడెంట్ కాండ్రేగుల వెంకట జగ్గారావు, సెక్రటరీ సిల్పరశెట్టి భాస్కర్ మెంబర్లు దిలీప్ కుమార్ భాస్కరరావు పాల్గొన్నారు.

# 81వ వార్డ్ ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు పంపిణీ



**(రాజధాని వార్తలు):** తెలుగుదేశం ప్రభుత్వం ప్రతి నెల సామాజిక భద్రత పెన్షన్లు ఎన్టీఆర్ భరోసా స్క్రీన్ ద్వారా పేద ప్రజలకు ఇచ్చే పెన్షన్ 4000 ఒకరోజు ముందుగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆదేశాల ప్రకారం జూన్ 1వ తేదీ ఆదివారం సెలవు దినం కాబట్టి లబ్ధిదారులు ఇబ్బంది పడకుండా గతంలో వలె ఒకరోజు ముందుగా ఉదయం 6 గంటలకే సచివాలయం సిబ్బంది లబ్ధిదారులకి అందజేశామని శ్రీ భోగలింగేశ్వర దేవస్థానం చైర్మన్ కాండ్రేగుల సత్యనారాయణ తెలియజేశారు.


# కశింకోటలో ఎన్టీఆర్ భరోసా పించన్లను పంపిణి చేసిన జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్





**అనకాపల్లి, (కశింకోట), (రాజధాని వార్తలు):** పేదల సేవలో భాగంగా జిల్లాలో పంపిణీ చేస్తున్న ఎన్టీఆర్ భరోసా సామాజిక పించన్లను సక్రమంగా, సకాలంలో పంపిణీ జరిగేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టరు విజయ కృష్ణన్ అధికారులను ఆదేశించారు. జూన్ ఒకటో తేదీ ఆదివారం కావడంతో ఒక రోజు ముందుగానే మే 31వ తేదీన ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ చేయాలని ప్రభుత్వ ఆదేశాల మేరకు శనివారం ఉదయం 7 గంటలకు నుండే జిల్లాలో పింఛన్ల పంపిణీ కార్యక్రమం ప్రారంభమైంది. శనివారం ఉదయం జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్ అనకాపల్లి నియోజకవర్గం కశింకోట మండలం కశింకోట 13వ వార్డు గవరపేట మధ్య వీధిలో ఎన్టీఆర్ భరోసా సామాజిక పించన్లు పంపిణీ కార్యక్రమంలో పాల్గొని నేరుగా లబ్దిదారుల ఇంటి వద్దకు వెళ్లి పెన్షను డబ్బులు అందజే సారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టరు లబ్దిదారులతో మాట్లాడుతూ ప్రతినెల ప్రభుత్వం అందిస్తున్న పెన్షను డబ్బులు పూర్తిగా అందు తున్నాయా, పెన్షను అందజేస్తున్నపుడు సచివాలయం సిబ్బంది డబ్బులు అడుగుతున్నారా వంటి వివరాలు అడిగి తెలుసుకున్నారు. పెన్షన్లు అందుకున్నప్పుడు డబ్బులు సరిచూసుకోవాలని తెలిపారు. లబ్దిదారులు పెన్షన్లు పంపిణీ ప్రక్రియపై సంతృప్తి, సంతోషం వ్యక్తం చేసారు. అనంతరం జిల్లా కలెక్టరు అధికారులతో మాట్లా డుతూ పెన్షన్లు పంపిణీ తొలి రోజే శత శాతం పూర్తి చేయుటకు కృషి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డి.ఆర్.డి.ఎ. ప్రోజెక్టు అదికారి కె.శచీదేవి. మండల ప్రత్యేక అధికారి వి ఎల్ సుభాషిణి, ఎంపీడీఓ రవికుమార్, తహసీల్దార్ సత్యనారాయణ, ఇతర వార్డు సచివాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# మైలవరం శాఖ గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరం





**మైలవరం, (రాజధాని వార్తలు):** విద్యార్థిని, విద్యార్థులచే తెలుగు, ఆంగ్ల దినపత్రికలు చదివించి చెప్పించడం జరిగినది. తదుపరి టి. ఓం ప్రకాష్ ఎంపీ. యు.పి.ఎస్. స్కూల్ గణపవరం, మైలవరం మండలం ఉపాధ్యాయులు విద్యార్థిని, విద్యార్థులకు ప్రపంచ ప్రఖ్యాతగాంచిన ప్రముఖ నోబుల్ బహుమతి గ్రహీతలు మరియు వారి చరిత్ర గురించి వివరించి చెప్పడం జరిగినది. ఈ కార్యక్రమానికి విద్యార్థిని, విద్యార్థులు, పాఠకులు, గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# పుణ్యశ్లోక అహల్య భాయ్ హెూల్కర్ 300వ జయంతి



**అనకాపల్లి, (రాజధాని వార్తలు):** అనకాపల్లి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో పుణ్యశ్లోక అహల్య భాయ్ హెూల్కర్ 300వ జయంతి జిల్లా పార్టీ కార్యాలయంలో నిర్వహింహించడ జరిగింది. ముందుగా అహల్య భాయ్ హెూల్కర్ చిత్రపటాన్నికి పూలమాల వేసి నివాళు లు అర్పిం చడం జరిగింది. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా కార్యదర్శి ఓరుగంటి నాగమణి మాట్లాడుతూ అహల్య భాయ్ హెూల్కర్ దేశంలో అనేక హిందూ దేవాలయాలను పునర్నిర్మాణం చేయడం ద్వారా సేవ,ధర్మ పరిరక్షణ,ఆధ్యాత్మిక కృషి చేయడం జరిగిందని ఆమె చేసిన కృషికి భారత ప్రభుత్వం ఆమె పేరుపై స్త్రీ శక్తి పురస్కారాన్ని నెలకొల్పారు. ఈ జయంతి కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.కొండ బాబు, జిల్లా ఉపాధ్యక్షులు ఉడా రమేష్, అసెంబ్లీ కన్వీనర్ బోడెడ నాగేశ్వరరావు, యువ మోర్చ జిల్లా అధ్యక్షులు జి.స్వరూప్, మండల అధ్యక్షులు కె సన్యాసిరావు, ఏ.అప్పారావు, బిజెపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పొగ త్రాగడం ప్రాణాంతకం

**- కాపాడుదాం దేశాన్ని...కాపాడుదాం : జేసీఐ శ్రీకాకుళం సన్ రైజర్స్ అధ్యక్షులు ప్రవీణ్. సింగూరు**





**శ్రీకాకుళం అర్బన్, (రాజధాని వార్తలు):** ధూమపానం ప్రాణాంతకమని, ప్రపంచ వ్యాప్తంగా మరణాల రేటు పెరగడానికి ధూమపానం అతిపెద్ద కారణమని జేసీఐ శ్రీకాకుళం సన్‌రైజర్స్ అధ్యక్షులు ప్రవీణ్. సింగూరు శనివారం అన్నారు. స్థానిక శ్రీకాకుళం పాత బస్ స్టాండ్, పొట్టి శ్రీరాములు కూడలి వద్ద ప్రపంచం పోగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా జేసీఐ శ్రీకాకుళం సన్ రైజర్స్ ఆధ్వర్యంలో పొగాకు వాడకంపై అవగాహన కార్యక్రమం నిర్వ హించారు. అధ్యక్షులు జేసీ ప్రవీణ్ కుమార్ సింగూరు మాట్లాడుతూ ధూమపానంతో శ్వాసకోశ వ్యాధులు, గుండె జబ్బులు, కంటి శు క్లాలు, క్యాన్సర్ వంటి తీవ్రమైన వ్యాధులకు దారి తీస్తుందని, సిగరెట్ పొగ శరీరంలోకి ప్రమాదకరమైన కణాలను విడుదల చేసి నిండు ప్రాణాలను బలి తీసుకొని జీవితాలను నాశనం చేయ డమే కాక, కుటుంబాన్ని దూరం చేస్తుందని, ధూమపానానికి యువత ఎక్కువగా ఆకర్షితులవ్వడం బాధాకరమన్నారు. పొగాకు వాడకానికి దూరంగా ఉండాలంటే చాలా మార్గాలున్నాయని, అవి తప్పక పాటిస్తే జీవితం సుఖవంతమౌతుందన్నారు. జోన్ కో ఆర్డినేటర్ బగాది.ప్రవీణ్ కుమార్, కార్యదర్శి సుదర్శన్ పట్నాయక్ మాట్లాడుతూ ప్రస్తుతం చాలా మంది పొగాకు వల్ల తీవ్ర అనారోగ్య సమస్యలకు గురై, పొగతాగే వారికే కాకుండా చుట్టూ ఉన్న వారు కూడా అనారోగ్య సమస్యల బారిన పడుతున్నారన్నారు. పొగాకు వల్ల వచ్చే ప్రమాదలపై సరైన అవగాహన లేకపోవడం వల్లే వ్యాధుల బారిన పడుతున్నారని, ప్రపంచ వ్యాప్తంగా అవగహన కల్పిండమే ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవమన్నారు. ఆనం తరం దినసరి కూలీలకు, మార్కెట్ వర్తకులతో, స్థానిక యువతతో మానెద్దాం మానేద్దాం పొగాకు మానేద్దాం, రక్షిద్దాం రక్షిద్దాం ప్రజల ప్రాణాలు రక్షిద్దాం, కాపాడుదాం కాపాడుదాం దేశాన్ని కాపాడుదాం అంటూ ప్రతిజ్ఞ చేయించారు.

ఈ కార్యక్రమంలో జేసీఐ శ్రీకాకుళం సన్ రైజర్స్ సభ్యుల బృందం, సామాజిక, సంఘ సేవకులు ఉర్లం శివతేజ పట్నాయక్, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# యోగా వల్ల సంపూర్ణ ఆరోగ్యం : అనకాపల్లి ఆర్డీఓ షేక్ అయిషా





**అనకాపల్లి, (రాజధాని వార్తలు):** ప్రతి రోజు యోగా చెయ్యడం వల్ల ఆరోగ్యంగా ఉంటామని అందువల్ల ప్రతి ఒక్కరూ విధిగా రోజు యోగ సాధన చేసినట్లయితే మనుషులు రోగాలు బారిన పడ కుండా ఆరోగ్యాంగా, సంపూర్ణంగా, ప్రశాంతంగా జీవిస్తారని అనకాపల్లి రెవిన్యూ డివిజనల్ అధికారి షేక్ అయిష్ అన్నారు. యోగాంధ్ర -2025 కార్యక్రమంలో భాగంగా శనివారం అనకాపల్లి పట్టణం రాజీవ్ గాంధీ ఇండోర్ స్టేడియంలో అనకాపల్లి రెవెన్యూ డివిజనల్ అధికారి షేక్ అయిషా ఆధ్వర్యంలో ఉదయం ఏడు గంటల నుండి 9 గంటల వరకు జిల్లాలో ఉన్న మాజీ సైనికులతో యోగాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. యోగా గురువులు మంగియ్య, బి.అప్పారావుల పర్యవేక్షణలో ఆర్డీఓ షేక్ ఆయుష, జిల్లా సైనిక సంక్షేమ అధికారి కృష్ణరావు, మాజీ సైనికులు యోగాసనలు వెయ్యడం జరిగింది. ఈ కార్యక్రమంలో



జిల్లా సైనిక సంక్షేమ అధికారి కృష్ణ రావు, మాజీ సైనికుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు హనుమంతరావు, తహసీల్దార్ బి విజయ కుమార్ మాజీ సైనికులు తదితరులు పాల్గొన్నారు.

# మలసాల భరత్ కుమార్ సోదరుడు మలసాల కుమార్ రాజాకి ఘన సత్కారం



**అనకాపల్లి, (రాజధాని వార్తలు):** గౌరవ ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్య మంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు రాష్ట్ర యువజన విభాగ కార్యదర్శిగా నియమింపబడిన అనకాపల్లి నియోజవర్గ సమన్వయకర్త మలసాల భరత్ కుమార్ సోదరుడు మలసాల కుమార్ రాజాని పూలదండ వేసి శాలువాతో సత్కరించిన ఆం ధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాల నాయుడు, అనకాపల్లి నియోజవర్గ పార్లమెంట్ పరిశీలకులు కరణం ధర్మశ్రీ, పెందుర్తి నియోజకవర్గం ఇంచార్జ్ అన్నం రెడ్డి అదీప్ కుమార్, అనకాపల్లి నియోజకవర్గ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ పరిశీలకులు శోభ హైమావతి, అరకు నియోజవర్గ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ పరిశీలకులు బొడ్డేడ ప్రసాద్, అనకాపల్లి పట్టణ పార్టీ అధ్యక్షులు మందపాటి జానకిరామరాజు, 83వ వార్డు కార్పొరే టర్ జాజుల రమేష్ మరియు ప్రజాప్రతినిధులు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

Printed & Published by Pattan Hussain Khan, on behalf of M/S Vastitude Media Pvt.Ltd; Printed at Jagathi Publications Ltd., Sakshi Press, Survey No. 766/2 Ankireddy Palem Village, Guntur Rural, Dist. Guntur-522005, AP; Published at 6-45/1, Thullur Mandal, Guntur Dt,AP-522237; RNI NO: APTEL/2019/77985, Whatsapp: 9440662699,Email: rajadhanivartalu@gmail.com | Web: rajadhanivartalu.com | Founding Editor: Pattan Hussain Khan